క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



రామచంద్రరావుకు మొక్క అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావును టేకులపల్లి మండల నాయకులు హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. హథీరామ్, జల్లరపు శ్రీనివాసరావు, శంభునాయక్, బాలాజీ, గాంధీ, అజయ్ పాల్గొన్నారు.

109శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాకు జూన్‌లో నిర్దేశించిన 11.27 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 12.23 లక్షల టన్నులు ఉత్పత్తి చేయడంతో 109 శాతం నమోదైందని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జేవీఆర్ ఓసీ–2లో 9లక్షల టన్నులకు 9.94 లక్షల టన్నులు (110శాతం), కిష్టారం ఓసీలో 2.10 లక్షల టన్నులకు 2.12 లక్షల టన్నులు (101శాతం) ఉత్పత్తి నమోదైందని పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన ఉద్యమకారులు

కొత్తగూడెంటౌన్: 1969 ప్రత్యేక తెలంగాణ సమితి సభ్యులు బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేజీఎస్ మాథ్యూస్ ఆధ్వర్యంలో సభ్యులు ఎస్పీ రోహిత్‌రాజును కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎండీ గౌస్, ఎస్.మంగపతి జి.లక్ష్మీనారాయణ, పి.వీరస్వామి, కే.కొమరయ్య పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓను...



డీఎంహెచ్ఓ జయలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా నూతనంగా జయలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పోరండ్ల శ్రీనివాస్, సెక్రటరీ జి.ఉమాదేవి, జిల్లా చీఫ్ అడ్వైజర్స్ ఎండీ.ఫైయాజ్ మోయుద్దీన్, ఎ.నాగభూషణం, జిల్లా కార్యవర్గ సభ్యులు సోమ్లానాయక్, రామచంద్రం, పూర్ణారావు, శివప్రకాష్ పాల్గొన్నారు.

మోతాదు మేరకే యూరియా వాడాలి

సుజాతనగర్: మోతాదు ప్రకారమే రైతులు యూరియా వాడాలని ఏఓ జి.నర్మద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట ఏపుగా పెరగాలని యూరియా అధికంగా వాడతారని, కాంప్లెక్స్ ఎరువులో యూరియా కలపొద్దని, అందులోనే యూరియా కూడా ఉంటుందని రైతులు గమనించాలని తెలిపారు. మొదటిసారి కాంప్లెక్స్ ఎరువును మొక్క సమీపంలో గుంత తీసి వేసి మట్టి కప్పాలని సూచించారు.

డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అస్తవ్యస్తం

- కంకర తేలిన రహదారి
- పిచ్చిమొక్కలు, గుంతలమయంగా ట్రాక్
- పరీక్షకు వచ్చే వాహనదారులకు ఇబ్బందులు



ట్రాక్‌పై పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు

కొత్తగూడెంటౌన్: ఎవరికి లైసెన్స్ కావాలన్నా.. ఎవరి వాహనానికి ఫిట్‌నెస్ టెస్టులు, ట్రాన్స్‌పోర్ట్ రిజిస్ట్రేషన్ టెస్టులు చేయాలన్నా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ (డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష కేంద్రము)కు రావాల్సిందే. అయితే టెస్ట్ ట్రాక్‌లో గుంతలు, పిచ్చిమొక్కలు పెరగడం, ట్రాక్‌పై కంకర తేలి, గుంతలుగా మారడంతో ట్రాక్ అంతా అస్తవ్యస్తంగా మారింది. రామవరంలోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అంతా సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.

అన్నీ ఇక్కట్లే... నిత్యం వాహనదారులకు లైసెన్స్‌లు మంజూరు చేసేందుకు, వాహనాల ఫిట్‌నెస్ కోసం ఎక్కువ సంఖ్యలో వాహనాలు, వాహనదారులు ఇక్కడికి వస్తుంటారు. అలాంటి ఫిట్‌నెస్, డ్రైవింగ్ టెస్టులు నిర్వహించే జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని జిల్లా రవాణాశాఖకు చెందిన రామవరం సీఆర్‌పీ క్యాంప్ సమీపంలోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఫిట్‌నెస్‌లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రిజిస్ట్రేషన్లు కోసం ఇక్కడికి వస్తుంటారు. కానీ వాహనదారులు ఇక్కడ వేచి ఉండేందుకు కూడా సరైన సౌకర్యాలు లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు.

ఎనిమిది ఎకరాల్లో... 2016లో రామవరంలో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటు కోసం ప్రభుత్వం జిల్లా రవాణాశాఖకు దాదాపు 8 ఎకరాలు స్థలాన్ని కేటాయించింది. ఇక్కడ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో వాహనదారులకు లైసెన్స్‌ల కోసం పరీక్షలు నిర్వహించడం, అదేవిధంగా వాహనాలకు ఫిట్‌నెస్, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు రిజిస్ట్రేషన్ పరీక్షలు నిర్వహిస్తారు. కానీ టెస్ట్‌కు రావాలంటే రహదారి కంకర తేలి అధ్వానంగా ఉందని, ట్రాక్ గుంతలమయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో ట్రాక్ అంతా బురదమయంగా మారిందని, ఇక్కడ కాసేపు ఉండటానికి కూడా ఎలాంటి సౌకర్యాలు లేవని వాపోతున్నారు. ట్రాక్ గుంతలు, కంకర తేలి ఉండటంతో టెస్టింగ్ సమయంలో స్కిడ్, గుంతల్లో పడిపోవడం వంటి సమస్యల వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.



టెస్ట్ ట్రాక్‌కు వెళ్లే రహదారిపై కంకర

సౌకర్యాలు కల్పించాలి...



రామవరంలోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో వాహనదారులకు సౌకర్యాలు కల్పించాలి. ట్రాక్‌లో గుంతలు, పిచ్చి మొక్కలతో వాహనదారులు టెస్ట్ సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాకాలం వస్తే.. ట్రాక్ అంతా బురదమయంగా మారుతుంది. ట్రాక్‌తో పాటు ఏరియా అంతా చదును చేసి అసౌకర్యం లేకుండా చేయాలి.

– బానోతు రాజ్‌కుమార్, రామవరం

వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు



రామవరంలోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఏరియాకు వెళ్లే రోడ్డు కంకర తేలి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలకు టెస్టింగ్‌ల కోసం ఏర్పాటు చేసిన రహదారి కావడంతో ఈ మార్గం ఒక్కటే దిక్కు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– వెంకన్న, గరీబ్‌పేట, రామవరం

త్వరలోనే ఆధునికీకరణ..



రామవరంలోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ట్రాక్ ఆధునికీకరణ, వాహనదారులకు సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళిక రూపొందించాం. పైఅధికారులకు నివేదికను పంపించాం. త్వరలోనే ట్రాక్ అంతా బాగు చేసి వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తాం.

– వి.వెంకటరమణ, జిల్లా రవాణాశాఖ అధికారి

వరద నీటిలో వెళ్లి గిరిజనులకు వైద్యం




వరద నీటిలో నడుచుకుంటూ రాజీవ్‌నగర్ కాలనీ వెళ్తున్న వైద్యసిబ్బంది

పాల్వంచరూరల్: పాండురంగాపురం సబ్ సెంటర్ పరిధి రాజీవ్‌నగర్ గిరిజన కాలనీలో బుధవారం ఉల్వనూరు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ఈ గ్రామానికి వర్షాకాలంలో కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని పరిస్థితి. ఈ క్రమంలో వైద్యసిబ్బంది వరద నీటిలో మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి గొత్తికోయ గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. అనంతరం ఇంటింటా జ్వరపీడితుల సర్వే నిర్వహించి, దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జితురామ్, ఆరోగ్య కార్యకర్త బి.శంకర్, బి.రాంరెడ్డి, ఉమారాణి పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్లు తనిఖీ చేయండి..

జూలూరుపాడు: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలు చేసింది. ఆయా యూనిట్లను అధికారులు తనిఖీ చేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ రాంబాబు నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. మండలంలో దళితబంధు పథకం కింద పలువురు షాపులు, వాహనాల యూనిట్లు ఇచ్చారని, అయితే లబ్ధిదారులు వాటిని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అంతేకాకుండా వారే ఇప్పుడు రాజీవ్ యువ వికాసం పథకం కోసం మళ్లీ తమకే ఇవ్వాలని అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, దీనివల్ల నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సమ్మె చారిత్రాత్మకం కావాలి..



సింగరేణి(కొత్తగూడెం): జీకే ఓసీ పిట్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్త లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, కోలిండియా, సింగరేణి సంస్థలకు బొగ్గు బ్లాకులు కేటాయించాలని, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీ ఏరియా స్టోర్స్‌లో పిట్ కార్యదర్శి గోపు కుమారస్వామి అధ్యక్షతన జరిగిన పిట్ మీటింగ్‌లో నాయకులు మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మికవర్గం ఆందోళన చేస్తున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రాంతీయ కార్మిక సంఘాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజాక్, మల్లికార్జున్‌రావు, కాపు కృష్ణ, గట్టయ్య, విజయగిరి శ్రీనివాస్, గడప రాజయ్య, ఎండీ గౌస్, సందెబోయిన శ్రీనివాస్, నటరాజ్, మోహన్, విప్లవ్ పాల్గొన్నారు.

టేకులపల్లి: ఈనెల 9న జరగనున్న దేశ వ్యాపిత సమ్మె చారిత్రాత్మకం కావాలని, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిద్దామని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వర్‌రావు, దుబాకుల ప్రసాద్, భవన నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిరావు ఉపేందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భావ్‌సింగ్, కల్తి వెంకటేశ్వర్లు, వెంకన్న, వీరస్వామి, వినోద్, రాజు, కుమార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు సమ్మెలో పాల్గొనవద్దు..

సింగరేణి(కొత్తగూడెం): కొన్ని కార్మిక సంఘాలు రాజకీయ దురుద్దేశంతో ఈనెల 9న చేపడుతున్న సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనవద్దని ఏబీకేఎంఎస్ నాయకుడు పి.మాధవనాయక్ కోరారు. కొత్తగూడెం ఏరియా పరిధి పీవీకే–5 ఇంక్‌లైన్ గని ఆవరణలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. దేశంలో అమలవుతున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చిందని, తద్వారా అన్నిరంగాల కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత లభిస్తున్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని సంఘాలు చేపడుతున్న సమ్మెకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం పలువురు యూనియన్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించి, వారిని గని మేనేజర్ శ్యాంప్రసాద్‌కు పరిచయం చేశారు. టీఎస్.పవన్‌కుమార్, మొగిలిపాక రవి, గంధం సతీష్, నాగేశ్వరరావు, అల్లి ప్రకాశ్, రంజిత్, రాజేష్, నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: జేకేలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పలువురు పేద విద్యార్థులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా పుస్తకాలు పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. మండల రాము, పులి సైదులు, డి.శివకుమార్, బోల్లా సూర్యం, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్ ఉన్నారు.

ప్రతిభ చూపిన 'సింగరేణి' విద్యార్థినులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి స్లోగన్ పోటీలలో స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపిరు. ప్రథమ సంవత్సరం విద్యార్థిని కె.అక్షయ ప్రథమ స్థానం సాధించింది. గతనెల 28న హైదరాబాద్‌లో ఐఎస్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.అజిత్‌మార్ చేతుల మీదుగా అక్షయ ప్రథమ బహుమతి, జి.అస్మిత, బి.సింధు, కె.సింధు ప్రశంసపత్రాలను అందుకున్నారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శి జీకే కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ శారద విద్యార్థినులను అభినందించారు.

తాగునీటి సరఫరా బంద్

కొత్తగూడెంఅర్బన్: వర్షాలకు బుధవారం కిన్నెరసాని తాగునీటి మెయిన్ లైన్ మొర్రేడు వాగులో తెగిపడిపోయింది. పునరుద్ధరించడానికి రెండు రోజులు పడుతుందని తాగునీటి సరఫరా నిలిపివేశామని ప్రజలు సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ సుజాత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆటో వర్కర్ల సంఘం కమిటీ ఎన్నిక

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నుంచి అనిశెట్టిపల్లి, బొమ్మనపల్లి వెళ్లే ఆటోడ్రైవర్లు బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గణేష్ టెంపుల్ అడ్డా డ్రైవర్లు ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా రెండోసారి సమ్మయ్యను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి, కార్యదర్శి వాసు, ఉపాధ్యక్షులుగా పూర్ణచందర్‌రావు, ఎస్.రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కుమారస్వామి, వి.జగదీష్, కోశాధికారి సందీప్, గౌరవ సలహాదారునిగా కిషన్‌లను ఎన్నుకున్నారు.

ఆకస్మిక తనిఖీ

పాల్వంచ: విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ జయలక్ష్మి అన్నారు. బుధవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. వానాకాలంలో డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి జ్వరాలు అచ్చే అవకాశం ఉంటుందని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని జగన్నాథపురం పీహెచ్‌సీ వైద్యులు రాజుకు సూచించారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు



తనిఖీకి వచ్చిన అధికారులు

ఇల్లెందు: బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందులో సబ్ డివిజన్ స్థాయి ఆపరేషన్ ముస్కాన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ సూర్య హెచ్చరించారు. బుధవారం ఇల్లెందులో ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు పర్యటించి పలుచోట్ల దుకాణాలు, హోటళ్లలో సోదాలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నెలరోజుల ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. చిన్నారులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎస్ఐ రవి

జూలూరుపాడు: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి కోరారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. రాబోవు మూడు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొనడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించే ప్రమాదం ఉందని, చెరువులు, కుంటలు తెగిపోయే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతేనే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించే సమయంలో దాటే ప్రయత్నం చేయరాదని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు అటువైపు వెళ్లకూడదన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, పశువులు, మేకల కాపరులు జాగ్రత్త వహించాలన్నారు. వాగులు, వంకల్లో చేపలు పట్టరాదని సూచించారు. ప్రజలు ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే తక్షణమే డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసుల సేవలను పొందాలని కోరారు.

వనమహోత్సవానికి సిద్ధం కండి..

ఇల్లెందురూరల్: గ్రామాలలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సిద్ధం కావాలని ఎంపీఓ చిరంజీవి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. నర్సరీలలో పెంచిన ప్రతీ మొక్క సద్వినియోగమయ్యేలా కార్యదర్శులు ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. అవెన్యూ ప్లాంటేషన్, ఇంటింటికీ మొక్కల పంపిణీ, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, కార్యాలయాల్లో నాటేందుకు అనువైన మొక్కలను గుర్తించి జాబితా సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు తక్షణం చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు.

కుండపోత వాన..



పాల్వంచరూరల్: నీట మునిగిన చెక్‌డ్యామ్


టేకులపల్లి: టేకులపల్లి మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కుండపోత వాన కురిసింది. ప్రెగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడెం, రాంపురం, పుణ్యపువాగులు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. టేకులపల్లి సెంటర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో వీధులను వరద ముంచెత్తింది. తొమ్మిదోమైలు తండా డబుల్ బెడ్ రూం కాలనీ ఎదుట వరద నీటితో చెరువులా మారింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఇల్లెందురూరల్: వారంరోజులుగా దోబూచులాడిన వరణుడు ఎట్టకేలకు కరుణించాడు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నేల తడిసి ముద్ద అయింది. అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు చెరువులకు నీరు చేరుతోంది. రెండు రోజుల క్రితం నెర్రెలు చాచిన చెరువులు జలసవ్వడితో సంతరించుకుంటున్నాయి. మండలంలోని పెద్ద చెరువులలో ఒకటైన చల్లసముద్రం జలకళ సంతరించుకుంది.

జూలూరుపాడు: మండల వ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రోజంతా ముసురు కొనసాగడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అన్నారుపాడు అలుగువాగు చప్టాపై నుంచి వరదనీరు ప్రవహించగా, పెద్దవాగు, తుమ్మలవాగు, ఎదళ్లవాగు, బండల రేవు వాగులు వరద నీటితో ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. పడమటనర్సాపురం–భేతాళపాడు గ్రామాల మధ్య నిర్మాణ దశల్లో ఉన్న విద్యుత్‌లైన్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ సందర్భంగా అధికారులు... భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అత్యవసరమైతేనే తప్ప ఇళ్లలో నుంచి బయట రావద్దన్నారు. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించే సమయంలో దాటే ప్రయత్నం చేయరాదన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే తక్షణమే 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉధృతంగా ప్రవహించే సమయంలో వాగులు దాటకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సెక్రటరీలను అధికారులు ఆదేశించారు.

పంటచేలల్లో చేరిన వరద..

పాల్వంచరూరల్: రెండురోజులు కురుస్తున్న వర్షానికి, వాగులు, వంకల్లో వరద నీరు చేరింది. పత్తి, వరినారు మళ్లల్లో వాననీరు నిలిచింది. రెడ్డిగూడెం వద్ద హైవే బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో పక్క నుంచి రాకపోకలకు తాత్కలిక పోసిన మట్టి రోడ్డు కొట్టుకపోయింది. పాండురంగాపురం వైపు వెళ్లే మార్గంలో వాగుపై నిర్మాణంలో ఉన్న చెక్ డ్యామ్ కొంత నీట మునిగిపోయింది. పాండురంగాపురం, పునుకుల, పుల్లాయిగూడెం, రెడ్డిగూడెం తదితర గ్రామాల్లో పత్తి, వరినారు మళ్లల్లోకి వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఇల్లెందురూరల్: రాఘుబోయినగూడెం చెరువులోకి భారీగా చేరిన వరదనీరు



జూలూరుపాడు: భేతాళపాడులో..



టేకులపల్లి: తూర్పుగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు

ఉత్తమ బోధన.. మెరుగైన ఫలితాలు

- గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభ
- అన్ని వసతులతో పడమటనర్సాపురం ఆశ్రమ పాఠశాల



గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల



తరగతి గదిలో విద్యార్థినులు

జూలూరుపాడు: గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న పడమటనర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మెరుగైన విద్యాబోధనతో విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన భవనాలు, పచ్చని చెట్లతో పాఠశాల ప్రకృతి నిలయంగా దర్శనమిస్తుంది. విశాలమైన తరగతి గదులు, సరిపడా అనుభజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థినుల పట్ల భద్రత, మెరుగైన విద్యాబోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

98శాతం ఫలితాలు...

పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జూన్ 6వ తేదీ నుంచి 19 వరకు చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం మంచి సత్ఫలితాలనిస్తోంది. 2025 – 2026లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను సైతం తలదన్నేలా ఆశ్రమ పాఠశాల అడ్మిషన్లు కొనసాగడం విశేషం. పోయిన సంవత్సరం 10వ తరగతిలో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2015–2016లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేశారు. 3 – 10 తరగతి వరకు విద్యార్థినులకు విద్యాబోధన చేస్తున్నారు. ప్రభుత్వ డైట్ మెనూ ప్రకారం ప్రతీరోజు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి డిన్నర్‌లో పౌష్టికాహారంతో కూడిన రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. వారంలో ఆరు రోజులు పండ్లు, ఐదు రోజులు గుడ్లు, ప్రతీనెల రెండో బుధవారం, ప్రతీ ఆదివారం చికెన్, ప్రతీ నెల రెండో ఆదివారం మటన్‌తో భోజనం ఉంటుంది. జూలూరుపాడు మండలంతోపాటు చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ, టేకులపల్లి, ఇల్లెందు, చంద్రుగొండ, ఖమ్మం జిల్లా ఏన్కూర్, కామేపల్లి మండలాలకు చెందిన బాలికలు ఆశ్రమ పాఠశాలలో చేరుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 500 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు.

నూరు శాతం ఫలితాలే లక్ష్యం...



పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యం. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో 98 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థినులు 88 మంది ఉన్నారు. 500 మంది విద్యార్థినులు చదువుకునే ఆశ్రమ పాఠశాలలో ఓవర్ హెడ్ ట్యాంకు లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు నీటి కొరత ఏర్పడుతోంది. కనీసం రెండు చేతి పంపులైనా ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదు. పాఠశాలలోని ఆర్ఓ ప్లాంట్ మరమ్మతులకు గురైంది విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. విశాలమైన పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు క్రీడలు, వ్యాయామం చేసేందుకు ఆటస్థలం లేకపోవడం లోటుగా ఉంది. 500 మంది విద్యార్థినులకు ఒక్కరే ఫిజికల్ డైరెక్టర్ ఉన్నారు.

– బానోత్ సుభద్రమ్మ, హెచ్ఎం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148
కె. మధు - 97059 44416